క్లుప్తంగా

దామోదర్ రెడ్డిని కలిసిన నాయకులు



సూర్యాపేటలో దామోదర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి : సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకొని తిరుమలగిరి మండల కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని సోమవారం సూర్యాపేటలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, రేతినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగారం : బిక్కేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులుగౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం మండలం వర్ధమానుకోట శివారులోని బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను వర్ధమానుకోట వద్ద పట్టుకొని సీజ్‌చేసి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీకాలు వేయించాలి

తుంగతుర్తి : పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరలతో మాట్లాడారు. నేటి నుంచి తుంగతుర్తిలోని పశు వైద్యశాలలో టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది సుష్మ, బుచ్చిబాబు, గణేష్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ దానం సుజాత, గ్రామస్తులు

అర్వపల్లి : మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు నిరుపేద కుటుంబీకుడు కావడంతో గ్రామస్తులు విరాళాలు వేసుకోవాలని నిర్ణయించారు. బొల్లంపల్లి ఫ్యామిలీ వాట్సప్ గ్రూప్ ద్వారా రూ.18,600 సేకరించి ఈ ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబీకులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి పంపిణీ



శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి పూజా సామగ్రి అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి : మాలిపురంలోని శ్రీ వేణు గోపాల స్వామి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు, 6వ వార్డు ఇన్‌చార్జ్ చింతకాయల సుధాకర్ మంగళవారం పూజా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శ్రీను, ప్రకాష్, ఎల్లయ్య, రాములు, నరేందర్, నాగరాజు, సైదులు, ప్రశాంత్, మహేష్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరించారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ వేముల నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగార్జునగౌడ్‌ల ఆదేశాల మేరకు క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ శేఖర్, ఉపేందర్, సుధీర్, యాకస్వామి, సురేష్, సందీప్, ప్రవీణ్, రఫీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో బుధవారం జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నరేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, చింతకుంటతండా, మర్రికుంట తండాల్లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభిస్తారని తెలిపారు.

పంచాయతీలకు పక్కా భవనాలు

- చివ్వెంల మండలంలో 15 గ్రామాలకు నిధులు మంజూరు
- ఉపాధిహామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు



చివ్వెంలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం

చివ్వెంల : గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గ్రామ పంచాయతీల కార్యాలయాలను కొన్ని చోట్ల అద్దెభవనాల్లో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గదులలో నిర్వహిస్తున్నారు. దీంతో పక్కా భవనాలు కావాలని సర్పంచ్‌లు అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారిచేసింది. దీంతో చివ్వెంల మండలంలో 31 గ్రామాలకు గాను 15 గ్రామాల్లో పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేశారు. చివ్వెంల మండలంలో 15 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించేందుకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. నిధులు కేటాయించిన గ్రామాల్లో చివ్వెంల, జగనాతండా, రాజుతండా, అక్కలదేవిగూడెం, మోదిన్‌పురం, ఉండ్రుగొండ, బి.చందుపట్ల, భీమ్లాతండా, ఐలాపురం, ఎర్రసూర్యాతండా ఉన్నాయి. ఇప్పటికే చివ్వెంల, మోదిన్‌పురం గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అదే విధంగా ఎస్‌టీఎఫ్ నిధుల కింద మండల పరిధిలోని పులింతండా, మున్యానాయక్‌తండా, పిల్లలజెగ్గు తండా, లక్ష్మణ్ నాయక్ తండా గ్రామాల్లో ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. దీంతో నూతన భవనాల నిర్మాణాలు పూర్తయితే గ్రామస్తులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి సేవలు అందించేందుకే..

"గ్రామాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకే ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసింది. ఉపాధిహామీ ద్వారా మంజూరైన నిధులతో విశాలంగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం జరుగుతోంది. ఎంపికైన గ్రామాల్లో భవనాల నిర్మాణం చేపట్టేవారు పనులను త్వరగా పూర్తి చేయడంతోపాటు.. నాణ్యత పాటించాలి.

– టి.గోపి, ఎంపీఓ, చివ్వెంల

నిర్మాణాలు చేపడుతున్నాం

"చివ్వెంల మండలంలో 15 గ్రామాలకు పక్కా భవనాల నిర్మాణాల కోసం ఉపాధిహామీ, ఎస్‌టీఎఫ్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఇప్పటికే చివ్వెంల, మోదిన్‌పురం గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా భవనాలు కూడా పూర్తి చేస్తాం.

– ధరావతు లింగానాయక్, పీఆర్ ఏఈ

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అర్వపల్లి : కోడూరు దేవాలయంలో అక్షింతలతో పూజలు చేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిరం ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి అక్షింతలకు మంగళవారం కోడూరు గ్రామ సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అక్షింతలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ప్రతిష్ఠ రోజు ఇంటింటికీ దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంచల లక్ష్మయ్య, చెంచల సోమనాథం, రుక్నయ్య, యాదగిరి, రమేష్, నరేష్, బ్రహ్మయ్య, ఎల్. వెంకన్న, బి. వెంకన్న, ఎల్. సోమయ్య, వి.వెంకన్న, మోహనాచారి, ఎస్. శ్రీను, జి.రాములు, జి.అంజయ్య, శంకర్, ఉప్పలయ్య, విశ్వనాథచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : అయోధ్యలో ఈ నెల 22 జరిగే రామ మందిరం ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి అక్షింతలను ధర్మ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఈటూరు గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ లక్ష్మణ శర్మ, ఆర్కే యువభారత్ ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్, సర్పంచ్ పేరాల సరితయాదగిరి, ఉపసర్పంచ్ రాంపల్లి సోమన్న, గొడిశాల యాదగిరి, బండి శీను, ఎల్లాచారి, వెంకన్న, ఉప్పలయ్య, రాములు, సాయిలు, యాదగిరి, అంజయ్య, నరసింహస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం, లింగాల గ్రామాల్లో అయోధ్య పూజిత అక్షింతల కలశానికి సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలను శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి శోభాయాత్రగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : ఈటూరులో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



పెన్‌పహాడ్ : లింగాలలో అక్షింతలను పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

వైభవంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భానుపురి : ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేదాంత భజన మందిర ప్రాంగణంలో శ్రీ గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకుడు దరూరి సింగరాచార్యులు ఆధ్వర్యంలో దరూరి రాఘవచార్యుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా వేడుకను చేపట్టారు. గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని పంచరాత్ర ఆగమశాస్త్ర రీతిలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో దివ్య మనోహరంగా అలంకరింపజేసిన గోదాదేవి రంగనాథులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై ఆసీనులను చేశారు. స్వస్తి వాచనం, విశ్వక్సేన పూజతో కల్యాణ తంతు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అమ్మ, స్వామి వార్లకు తలంబ్రాలు వడి బియ్యం పోశారు. మంగళ హారతులు పట్టి అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు రాచర్ల వెంకటేశ్వరరావు, నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, పులిగిల్ల అర్జునుగుప్త, వీరవెల్లి రాంమూర్తి, సోమ సుమన్, షీలా శంకర్, కుక్కడపు శ్రీనివాస్, కొత్తూరు రాజు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వాలి

తుంగతుర్తి : కాంగ్రెస్ అధిష్టానం అద్దంకి దయాకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు చింతకుంట్ల రంజిత్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గత పది ఏళ్ల నుంచి అద్దంకి దయాకర్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని అన్నారు. 2004 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ కోసం అనునిత్యం పనిచేసిన నాయకుడు అద్దంకి దయాకర్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తదుపరి మంత్రి వర్గ విస్తరణలో అద్దంకి దయాకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు పోతురాజు సురేష్, పాలేపాక సుదర్శన్, కాసర్ల వెంకటేష్, బాలే బాచి, కొమ్మరబోయిన మహేందర్ ఉన్నారు.

నిబంధనలు పాటించని వైన్స్‌లపై చర్యలు తీసుకోవాలి

అర్వపల్లి : అర్వపల్లిలో ప్రభుత్వ నిబంధనలు పాటించని వైన్స్ షాప్‌లపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అర్వపల్లి శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపుల యజమానులు పోటీలు పడి తమ వాహనాల్లో గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని చెప్పారు. అలాగే స్థానిక దేవాలయ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలను నడిపిస్తున్నారని తెలిపారు. ప్రసిద్ధిగాంచిన ఆలయం సమీపంలోనే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారని చెప్పారు. మద్యం ప్రియులు మద్యం సేవించి ఆలయ పరిసరాల్లోనే ఖాళీ సీసాలను పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేసేలా వైన్స్ షాపుల యజమానులు ప్రోత్సహిస్తూ అధిక రేట్లకు మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు. త్వరలో దుకాణాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



తిమ్మాపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న వాణిశ్రీకాంత్‌రాజ్, గ్రామస్తులు

అర్వపల్లి : భక్తిభావంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, శిగ రవికుమార్, తాడోజు ఆచారి, బి.నారాయణ, పాపయ్య, యాదయ్య, జగన్‌మోహనాచారి, బ్రహ్మచారి, రమణాచారి, నాగేంద్రాచారి, రమేష్, నాగరాజు, శ్రీను, భిక్షం, భాస్కర్, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మందుల సామేల్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొల్లంపల్లి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కేసగాని మహేశ్వర్, ఉపసర్పంచ్ కేసగాని రామనర్సయ్య, నాయకులు ఖమ్మంపాటి వెంకటేష్, షేక్ జహంగీర్, కేసగాని సందీప్, కడారి నితిన్ ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

నూతనకల్ : క్రీడల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సీఐ అంజపల్లి నాగమల్లు అన్నారు. చిల్పకుంట్లలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, శ్రీను, సంజీవరెడ్డి, ఉపేందర్, తొట్ల లింగయ్య, పంతం లింగయ్య, తొట్ల అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన దండోలు మహంకాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యారాల నర్సింహారెడ్డి, పడిశాల పెద్ద లింగయ్య, గైగుళ్ల సైదులు, శివరాత్రి ఇద్దయ్య, తంగళ్లపల్లి సతీష్, పడిశాల రాజశేఖర్, దేవరకొండ ఉపేందర్, పడిశాల నరేష్ పాల్గొన్నారు.

పేద ప్రజలకు సేవలందించడమే ధ్యేయం



చెక్కు అందజేస్తున్న చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్

అర్వపల్లి : పేద ప్రజలకు సేవలందించడమే రేఖ చారిటబుల్ ట్రస్టు ధ్యేయమని ఆ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ రేఖ బోయినపల్లి, ట్రస్టు డైరెక్టర్, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని అడివెంల గ్రామంలో పేదలకు మంగళవారం వివిధ రకాల సాయమందించారు. అలాగే సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు కబడ్డీ పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన ఆవుల మహేష్‌జట్టుకు రూ.10,116, ద్వితీయ బహుమతి పొందిన బొర్ర రమేష్ జట్టుకు రూ.5,116 చొప్పున చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు నిమ్మనగోటి గణేష్, చెరుకు నాగేందర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

తిరుమలగిరి : శాసన సభ్యుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌ను ఎంపిక చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు మంగళవారం రాత్రి తిరుమలగిరిలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ ఎం.జితేందర్, పరదేశీనాయుడు, గణేష్, గంగాధర్, ఈశ్వర్, రాజు, మహ్మద్ జాని, యాదగిరి, ఉపేందర్, యాకుబ్‌పాష, జహీందర్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొనసాగుతున్న 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'



రాజానాయక్ తండాలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది, తదితరులు

తిరుమలగిరి : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం రాజానాయక్ తండా, ఖోక్యానాయక్ తండా గ్రామ పంచాయతీల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మల్లెల వందన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకుల సతీష్, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రంగుల వెంకటరవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయంలో కొత్త ట్యాప్‌ల బిగింపు



నల్లాలకు బిగించిన ట్యాపులు

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : ట్యాప్‌లు పనిచేయక నీళ్లు వృథా అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గత కొంత కాలంగా నల్లా ట్యాప్‌లు పనిచేయక నీళ్లు వృథాగా పోతున్నాయి. ఆలయం ఎదుట మూడు నల్లా ట్యాప్‌లను ఏర్పాటు చేయగా ఏ ఒక్కటి పనిచేయక పోవడంతో నీళ్లు వృథా అయ్యాయి. అయితే దేవాదాయ శాఖ ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డిలు స్పందించి పాత ట్యాపులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. అలాగే నల్లాల చుట్టూ పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను గ్రామపంచాయతీ సిబ్బందిచే శుభ్రం చేయించారు.

కూలీల కొరత.. చేలల్లోనే పత్తి



ఏరకుండా చేనులోనే ఉన్న పత్తి

పత్తి రాలిపోతోంది



"కూలీలు దొరక్క చేనులో పత్తి రాలిపోతుంది. కూలి రూ.300, ఆటోకి రూ.50 కలిపి మొత్తం రూ.350 చెల్లించి పత్తి ఏరిద్దామన్న కూలీలు లభించే పరిస్థితి లేదు. ఈ ఏడాది పత్తి పంట అనుకున్నంత దిగుబడి రాలేదు. దీనికితోడు గిట్టుబాటు ధర లేదు.

– బండగొర్ల దుర్గయ్య, రైతు, పస్తాల

నాగారం : మండలంలో కూలీల కొరతతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పత్తిని తీసి విక్రయించాల్సిన రైతులు కూలీలు దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కూలీల కోసం ఉదయాన్నే గ్రామాల్లో తిరిగి, కూలీ డబ్బులు కూడా ముందే అడ్వాన్సుగా చెల్లించి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఒక్కో కూలీకి రూ.300, ఆటో కిరాయి రూ.50 కూడా రైతే భరించి మొత్తం రూ.350 ఇస్తేగాని కూలీలు వచ్చే పరిస్థితి లేదు. ఇదిలా ఉంటే మండలంలోని నాగారం, ఫణిగిరి, వర్ధమానుకోట, ఈటూరు, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పత్తి తీసినందుకు కేజీకి రూ.20 నుంచి రూ.30 ఇస్తామన్నా కూలీలు దొరికే పరిస్థితి లేదు. మొత్తానికి పంట దిగుబడి లేక, కూలీలు దొరక్క, పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు వాపోతున్నారు.

పత్తికి మద్దతు ధర కరువై..

నాగారం మండలంలో ఈ ఏడాది సుమారు 4,700 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇప్పటివరకు రెండు సార్లు ఏరిన పత్తిని రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకొని గిట్టు బాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్థిక అవసరాల నిమిత్తం కొంతమంది రైతులు మాత్రమే పంటను విక్రయించారు. గత ఏడాది రూ.8000లుగా ఉన్న పత్తి ధర ఈ ఏడాది రూ.7 నుంచి రూ.6వేలుగా ఉంది.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



నాగారం : ఫణిగిరిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ఎదుట రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు పతంగులు ఎగురవేశారు. పలు గ్రామాల్లో క్రీడా పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణాల నుంచి చాలా మంది తమ సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. – సాక్షి నెట్‌వర్క్



నాగారం : పస్తాలలో బసవన్నకు కానుకలు అందజేస్తున్న గ్రామస్తులు



చివ్వెంలలో ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న నాయకులు



తిరుమలగిరిలో ముగ్గు వేస్తున్న మహిళ